# శ్రీమతి డి. కామేశ్వరి



**పూర్తి పేరు:** దూర్వాసుల కామేశ్వరి

**బాల్యం:** పుట్టింది ఆగస్టు 22, 1935న కాకినాడలో. పెరిగింది, చదివింది రామచంద్రపురం (తూ.గో. జిల్లా)

**పెళ్ళి, పిల్లలు:** 1952లో శ్రీ డి.వి. నరసింహంతో పెళ్ళయ్యేక– శ్రీవారి ఉద్యోగరీత్యా 1984 వరకూ ఒరిస్సాలో నివాసం. 1984లో శ్రీ నరసింహం ఒరిస్సా ఎలక్ట్రిసిటీ బోర్డులో చీఫ్ ఇంజనీరుగా రిటైరైనప్పట్నించీ హైదరాబాదులో స్థిరనివాసం. జీవితంలో చక్కగా స్థిరపడ్డ ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి.

**రచనా వ్యాసంగం:** 1962లో ఆరంభమై నేటివరకూ నిరవధికంగా కొనసాగుతోంది. 250 కథలు (10 కథా సంపుటాలు), 21 నవలలు, 30 కవితలు (1 కవితా సంపుటి), ఒక ట్రావెలోగ్ ప్రచురితం. ఆంధ్రపత్రికలో "వనితలు–వస్త్రాలు" అన్న వ్యాసం తొలి రచన. అదే పత్రికలో "ఆనందరావు–ఆకాకరకాయలు" తొలి కథ. 1968లొ ఎమెస్కో వారు ప్రచురించిన "కొత్తనీరు" తొలి నవల.

కొన్ని కథలు (సుమారు 10), నవలలు (సుమారు 4) వివిధ పత్రికల్లో బహుమతులు గెల్చుకున్నాయి. కొన్ని కథలు, నవలలు కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువదించబడ్డాయి. కొన్ని కథలు, నవలలు– కథలుగా, నాటకాలుగా రేడియోలో ప్రసారమయ్యాయి. ఇతర కథా సంకలనాలలోనూ కొన్ని కథలు స్థానం పొందాయి.

**అవార్డులూ, రివార్డులూ:**

గృహలక్ష్మి స్వర్ణకంకణం (1970)

ఉత్తమ సినీ కథా రచయిత్రిగా సితార, ఆంధ్రభూమి, సినీ హెరాల్డ్, వంశీ బర్కిలీ, కళాసాగర్ సంస్థలనించి 5 అవార్డులు (కొత్త మలుపు నవల ఆధారంగా తీసిన న్యాయం కావాలి– చలన చిత్రానికి 1981లో)
మాదిరెడ్డి సులోచన అభినందన అవార్డు (1983)
తెలుగు యూనివర్సిటీనించి ఉత్తమ రచయిత్రిగా ఎండీ వెంకట్ అవార్డు (1990)
మద్రాసు తెలుగు అకాడెమీ నించి ఉత్తమ రచయిత్రి అవార్డు (1991)
తెలుగు యూనివర్సిటీనించి ఉత్తమ రచయిత్రిగా అవార్డు (1994)
సుశీలా నారాయణరెడ్డి అవార్డు (1998)
తెలుగు యూనివర్సిటీనించి ఉత్తమ నవలా రచయిత్రిగా అవార్డు (1999)
ఎండమావులు నవలకి గోపీచంద్ అవార్డు (2006)
బరంపురం ఆంధ్రసంఘం, భువనేశ్వర్ ఆంధ్రసంఘం, సిటీ సెంట్రల్ లైబ్రరీ, దక్షిణ మధ్య రైల్వే ఆంధ్రసంఘం మొదలైన సంస్థలచే సన్మానం.
కొత్త మలుపు నవలకి న్యాయం కావాలి చలనచిత్రంగా తెలుగు, తమిళం, కన్నడం, హిందీ భాషల్లో శతదినోత్సవాలు.
కోరికలే గుర్రాలైతే నవలకి అదే పేరుతో దాసరి దర్శకత్వంలో చలనచిత్రరూపం.
ఎండమావులు నవల కన్నడంలో టెలి ప్లే గా.
అరుణ నవల జమున దర్శకత్వంలో డాక్టర్ మమత టీవీ సీరియల్ గా.
మనసున మనసై, జీవతం చేజారనీయకు– నవలలు టీవీ సీరియల్స్‌కి స్వీకారం.
కొడుకు ఖరీదు, వైరస్, కార్యేషు మంత్రీ– టీవీలో అరగంట కథలుగా ప్రసారితం.

## తన రచనల గురించి రచయిత్రి మాటల్లో:

రచనకి సామాజిక ప్రయోజనం ఉండాలి. ఇతివృత్తం ఏదో ఒక సమస్యని పాఠకుల దృష్టికి తేవాలి. నేను స్త్రీని కనుక నా కథల్లో స్త్రీల సమస్యలకి ప్రాధాన్యమిచ్చాను. రచనల్లో ఈ తరం సమస్యలు ప్రతిబింబిస్తే– ముందు తరాల వారికి పురోగమించారో, తిరోగమించారో– అంచనా వేసుకునే వీలుంటుందనుకుంటాను. కథలు సమకాలీన సమాజానికి దర్పణమై– ఈనాటి సాంఘిక, రాజకీయ, ఆర్థిక జీవన స్థితిగతుల్ని ముందు తరాలవారికి మార్గదర్శకంగా చిత్రీకరించాలనుకుంటాను. పాడగా పాడగా రాగంలా, వ్రాయగా వ్రాయగా ఒక విషయం పాఠకుల దృష్టిని ఆకట్టుకుంటుందని నమ్ముతాను. పురోగమించినట్లు కనిపిస్తున్నా ఈనాటి స్త్రీ ఇంకా అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. తల్లిగా, కూతురిగా, ఉద్యోగినిగా, ఆర్థిక స్వాతంత్ర్యమున్న పురుషుని అధికారానికి తల ఒగ్గే అర్థాంగిగా– జీవనయాత్ర కొనసాగిస్తున్న నేటి స్త్రీల అనేకానేక సమస్యలే నా కథా వస్తువులు. హితం చెబుతూ, సమస్యని వివరించి పరిష్కారం కూడా సూచించాలనీ– విప్లవాలు, ఆదర్శాలకంటే– పాఠకుల్ని ఆలోచింపజేసే రచనలు చేయడం రచయిత/త్రులు బాధ్యతగా భావించాలనీ నమ్ముతూ, ఆచరిస్తున్నాను. పాఠకులు, విమర్శకుల దృష్టిలో మంచి రచయిత్రి అనిపించుకోగలగడం నా అదృష్టం.